## 12న దేశవ్యాప్త సమ్మె పోస్టర్ల ఆవిష్కరణ



**మనస్సాక్షి, నార్పల:** కార్మికుల హక్కులు హరించే రీతిలో కేంద్రంలోని నరేంద్ర మోడీ తెచ్చిన నూతన చట్టం రద్దు కోరుతూ ఈనెల 12న దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నామని, ఈ సమ్మెలో అసంఘటిత కార్మికులు పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బిహెచ్ నాయుడు తెలిపారు. మంగళవారం దేశవ్యాప్త సమ్మె పోస్టర్లను సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం నేతలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, ఎర్రి నాగప్ప, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి సహకరించండి



**మనస్సాక్షి, నార్పల:** స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలోని ప్రజలందరూ సకాలంలో ఇంటి పన్నులు, నీటి పన్నులు చెల్లించి గ్రామ అభివృద్ధికి సహకరించాలని నూతనంగా పంచాయతీ కార్యదర్శులు బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులు ప్రజల్ని కోరారు. శ్రీనివాసులు మంగళవారం స్థానిక మేజర్ పంచాయతీ కార్యదర్శి గా బాధ్యతలు స్వీకరించారు. బొందలవాడ పంచాయతీని పారిశుధ్యంలో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడంలో ప్రత్యేక శ్రద్ధ వహించారు. ప్రజలు సక్రమంగా ఇంటి పన్నులు నీటి పనులు చెల్లించినప్పుడే గ్రామాభివృద్ధి సాధ్యమని పన్నులు చెల్లించడం ప్రజలు బాధ్యతగా గుర్తించాలని ఆయన కోరారు

## నడిమిదొడ్డిలో పొలం పిలుస్తోంది



**మనస్సాక్షి, నార్పల:** మండలం పరిధిలోని నడిమిదొడ్డి గ్రామ పొలాల్లో మండల వ్యవసాయ శాఖ అధికారి చెన్న వీరస్వామి ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉద్యాన శాఖ అధికారి నెట్టికంటయ్య, శాస్త్రజ్ఞులు కళ్యాణి, కిషోర్ కుమార్ రెడ్డి హాజరై.. వేరుశెనగ, మొక్కజొన్న, కరివేపాకు, చీనీ పంటల సమగ్ర సస్యరక్షణ పై రైతులకు అవగాహన కల్పించారు. తెగుళ్ల నియంత్రణకు సమర్థవంతమైన మందుల వినియోగంతో ఖర్చు తగ్గించుకొని దిగుబడి పెంచుకోవచ్చునని రైతులకు అవగాహన కల్పించారు.

## వైసిపి బలోపేతం కోసం కృషి చేయండి



**మనస్సాక్షి, నార్పల:** గ్రామ కమిటీ సభ్యులు జగనన్నను మళ్లీ సీఎం చేసుకోవడం కోసం బలంగా కృషి చేయాలని వైసిపి రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్యనారాయణ రెడ్డి కోరారు. మండల వ్యాప్తంగా వైసిపి గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని, గ్రామ కమిటీ సభ్యులు కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. మంగళవారం మద్దలపల్లి గ్రామ కమిటీ సభ్యుల వివరాలను వైసిపి రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్యనారాయణ రెడ్డి, మండల కన్వీనర్ ఖాదర్ వలీ, ఎస్సీ సెల్ అధ్యక్షులు ప్రభుదాస్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి సాకే రామాంజనేయులుకు అందజేశారు.

## పంచాయతీ బోరును పరిరక్షించండి



**మనస్సాక్షి, నార్పల:** మండలంలోని జంగంరెడ్డిపల్లి లో సర్వేనెంబర్ 44 లో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న అక్రమ బోరును సీజ్ చేసి, గ్రామస్తులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని సిపిఐ మండల కార్యదర్శి సాకే. గంగాధర ఎంపీడీవో మమతా దేవికి మంగళవారం వినతి పత్రాన్ని అందించారు. వాల్టా చట్టానికి విరుద్ధంగా బోరువేసిన వ్యక్తిపై చట్టపరంగా చర్యలు తీసుకొని గ్రామస్తులకు తాగునీటి సమస్య తీర్చాలని విన్నవించారు. కార్యక్రమంలో చేపల రామాంజి, సుధాకర, లలితమ్మ, సూరి, లింగారెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

## పరిపాలనలో వైఫల్యాలు కప్పిపుచ్చుకునేందుకే

# చంద్రబాబు డైవర్షన్ రాజకీయాలు

**మనస్సాక్షి, అనంతపురం:**



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

రాష్ట్రంలో పరిపాలనలో వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. అనంతపురంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసినా, గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుతం రాజకీయంగా అభద్రతా భావంలో ఉన్నారని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 20 నెలల్లో కూడా సక్రమంగా అమలు చేయలేకపోయారని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతి ఆరోపణలను దాచిపెట్టేందుకు కల్తీ మద్యం, వివేకానందరెడ్డి హత్య, చివరకు తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతు కొవ్వు, పంది కొవ్వు కలిసిందని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, నారా లోకేష్, టీడీపీ నేతలు ప్రచారం చేశారని అన్నారు. ఈ ఆరోపణలపై వైయస్ఆర్ సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, బీజేపీ నేత సుబ్రమణ్యం సుప్రీంకోర్టును ఆశ్రయించగా, కోర్టు ఆదేశాలతో సీబీఐ ఆధ్వర్యంలో సిట్ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. సిట్ విచారణలో భాగంగా ఎన్‌డీఆర్‌ఏ, ఎన్‌డీడీబీ ల్యాబ్‌లు నిర్వహించిన పరీక్షల్లో లడ్డూ తయారీలో ఉపయోగించిన నెయ్యిలో ఎలాంటి జంతు కొవ్వు లేదని తేలినా, చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు దుష్ప్రచారం ఆపడం లేదని మండిపడ్డారు. సిట్ నివేదికలో వాస్తవాలు బయటకు రావడం చంద్రబాబుకు రుచించకపోవడంతో మళ్లీ తప్పుడు ప్రచారానికి దిగుతున్నారని విమర్శించారు. శ్రీవారి లడ్డూను కోట్లాది మంది భక్తులు మహాప్రసాదంగా స్వీకరిస్తారని, అలాంటి పవిత్ర ప్రసాదాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం దురదృష్టకరమని అన్నారు. లడ్డూలో కెమికల్స్ కలిపారని మరోసారి ఆరోపణలు చేయడం ఆశ్చర్యకరమని, పరిపాలన అనుభవం ఉన్న నాయకుడు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో మహిళలకు నెలకు రూ.1500, నిరుద్యోగులకు రూ.3 వేల భృతి ఇస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ఆ ప్రశ్నలు వచ్చినప్పుడల్లా లడ్డూ వివాదంతో దారి మళ్లిస్తున్నారని ఆరోపించారు. కేబినెట్ సమావేశాల్లో కూడా ఇదే చర్చ జరుగుతోందని, చంద్రబాబుకు 'జగన్ ఫోబియా' పట్టుకుందని వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో తనకు అడ్డువచ్చిన వారిపై వ్యక్తిగత ఆరోపణలు చేయడం చంద్రబాబుకు అలవాటేనని, వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కూడా తప్పుడు ప్రచారం చేయాలని చూస్తున్నారని అన్నారు. తక్కువ ధరకు నెయ్యి దొరుకుతుందా అని ప్రశ్నిస్తున్న చంద్రబాబు, తన హయాంలోనే ప్రస్తుతం ఆరోపణలు ఎదుర్కొంటున్న సంస్థ నుంచే తక్కువ ధరకు నెయ్యి కొనుగోలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. పరిపాలనలో పూర్తిగా విఫలమైన చంద్రబాబు డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని, శ్రీవారి లడ్డూ అంశంలో తనకు అనుకూలంగా నివేదిక వచ్చే వరకు విచారణ కొనసాగించాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. 20 నెలల్లో రూ.3 లక్షల కోట్ల అప్పులు చేసిన ప్రభుత్వం ఆ డబ్బు ఎక్కడ ఖర్చు చేసిందో కూడా చెప్పలేని పరిస్థితి ఉందని విమర్శించారు. శ్రీవారి లడ్డూ అంశంపై చేసిన ఆరోపణలపై వాస్తవాలు బయటపడుతున్న నేపథ్యంలో చంద్రబాబు, కూటమి నేతలు ప్రజలకు క్షమాపణ చెప్పాలని, ఇచ్చిన హామీల అమలు, పరిపాలనపై దృష్టి పెట్టాలని అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెన్నోబుళేసు, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాసరెడ్డి, వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెన్నం శివారెడ్డి, క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జానీ, కల్చరల్ వింగ్ నగర అధ్యక్షుడు కసిరెడ్డి కేశవరెడ్డి, వైసీపీ నేత కుళ్లాయిస్వామి పాల్గొన్నారు.

## సేవాలాల్ జయంతికి పకడ్బందీ ఏర్పాట్లు



**మనస్సాక్షి, అనంతపురం :** శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకల కోసం పకడ్బందీగా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం గుత్తి మండలం సేవాగఢ్ లోని సేవాలాల్ మహరాజ్ ఆలయం పక్కనున్న సమావేశ హాల్ లో ఈనెల 13, 14, 15వ తేదీలలో నిర్వహించే శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకల కోసం పోలీస్ బందోబస్తు ఏర్పాటు పక్కాగా ఉండాలని, ఎంట్రీ మరియు ఎగ్జిట్ జాగ్రత్తగా చూసుకోవాలని, ఆర్డీఓ, డిఎస్పీ సమన్వయం చేసుకుని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. శానిటేషన్ కోసం అవసరమైన సిబ్బందిని నియమించాలని, ఇబ్బంది లేకుండా శానిటేషన్ చేపట్టడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ట్రస్ట్ వారితో సమన్వయం చేసుకుని తాగునీరు అందించాలన్నారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, సిసిటివి కెమెరాలను ఏర్పాటు చేసుకుని మానిటర్ చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలని, జయంతి వేడుకలను విజయవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం శ్రీ జగదాంబ మాత దేవాలయాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సమావేశంలో ట్రైనీ ఐపీఎస్ అశ్విన్ మనిదీప్, గుంతకల్లు ఆర్డీఓ ఏబీవీఎస్బి శ్రీనివాస్, శ్రీ సేవాలాల్ మహరాజ్ ట్రస్ట్ అధ్యక్షుడు కేశవనాయక్, ట్రస్ట్ నుంచి అశ్వత్థనాయక్, డిటిడబ్ల్యుఓ శ్రీనివాసరావు, డీఎల్డిఓ విజయలక్ష్మి, సేవాగఢ్ సర్పంచ్ వెంకటేష్, గుంతకల్లు మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మియా, ఐ.అండ్.పీఆర్ డిఐపిఆర్ఓ ఏ.బాలకొండయ్య, ఎక్సైజ్ ఎస్ఐ పి.గోపాల్ మరియు సిబ్బంది, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నూతన ఫర్టిలైజర్ షాపును ప్రారంభించిన ప్రభుత్వ విప్



**మనస్సాక్షి, కణేకల్లు:** కణేకల్లు పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన భారతి ఫర్టిలైజర్స్ దుకాణాన్ని ప్రభుత్వ విప్, రాయదుర్గం శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు ప్రారంభించారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఎస్.బీ.ఐ ఎటిఎం వద్ద ఏర్పాటు చేసిన ఈ షాపు ప్రారంభోత్సవ కార్యక్రమానికి మరేంపల్లి గ్రామానికి చెందిన షాపు యజమాని తిప్పేస్వామి ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు రిబ్బన్ కట్ చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొప్రైటర్ తిప్పేస్వామి, ఆయన తండ్రి తిమ్మప్పతో పాటు కుటుంబ సభ్యులు లక్ష్మన్న, రామన్న, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు లాలెప్ప, మండల కన్వీనర్ వన్నారెడ్డి, నాయకులు వాల్మీకి నాగార్జున, ఎస్.కే మల్లికార్జున, చాంద్ బాషా పాల్గొన్నారు.

## పీవీకేకే కళాశాల సహాయ అధ్యాపకులు సతీష్ నాయక్‌కు పీహెచ్‌డీ



**మనస్సాక్షి, అనంతపురం :**



జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ (అనంతపురము) నుంచి మేనేజ్మెంట్ (ఎంబీఏ) విభాగంలో సతీష్ నాయక్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆయన అనంతపురంలోని పీవీకేకే ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్‌లో సహాయ అధ్యాపకునిగా సేవలందించారు. శ్రీ బాలాజీ పీజీ కళాశాల (ఎంబీఏ) ప్రిన్సిపాల్ డా. మాదాల సుబ్బారావుని ప్రధాన పర్యవేక్షకుడిగా, ఆచార్య టి. నారాయణ రెడ్డి అంతర్గత పర్యవేక్షణలో, అనంతపురం జిల్లాలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) అభివృద్ధి మరియు వృద్ధిపై ప్రాథమిక సమాచార ఆధారంగా పరిశోధన చేసి పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. ఈ పరిశోధనలో ఎంఎస్ఎంఈ యూనిట్లు ఎదుర్కొంటున్న సమస్యలు, అభివృద్ధి అవకాశాలు, ప్రభుత్వ ఆర్థిక సహాయం, సబ్సిడీలు, సాంకేతిక పరిజ్ఞానం, ఉపాధి కల్పన, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, సింగిల్ డెస్క్ పోర్టల్, జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా అందుతున్న సహాయ కార్యక్రమాలు పరిశ్రమల వృద్ధికి మరియు ఉపాధి అవకాశాల పెరుగుదలకు కీలకంగా నిలుస్తున్నట్లు వెల్లడైంది. సాంకేతిక పరిజ్ఞానం, ఆర్థిక సహాయం, ఉపాధి కల్పన పరస్పరం ముడిపడి ఉన్నాయని, ఆధునిక సాంకేతికత స్వీకరణ ద్వారా ఆర్థిక వృద్ధి సాధ్యమవుతుందని అధ్యయనం సూచించింది. ఈ సందర్భంగా శ్రీ బాలాజీ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ డా. పల్లె కిషోర్, మాజీ మంత్రి డా. పల్లె రఘునాథ రెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, సతీష్ నాయక్‌కు అభినందనలు తెలిపారు.

## వరుస దొంగతనాలకు పాల్పడుతున్న మైనర్ల అరెస్ట్.!



**మనస్సాక్షి, కణేకల్లు:** మండలంలోని పూలచెర్ల గ్రామంలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు మైనర్ బాలురను కణేకల్లు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 11వేలు నగదు, 5 గ్రాముల బంగారు ఉంగరం, రెండు వాటర్ మోటార్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నాగమధు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. గత కొద్దిరోజులుగా పూలచెర్ల గ్రామంలో దొంగతనాలు జరుగుతున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. గ్రామానికి చెందిన చాకలి రామన్న ఇంట్లో 5 గ్రాముల బంగారు ఉంగరం, వెయ్యి రూపాయలు నగదు, అలాగే బెస్త వన్నూరుస్వామి ఇంట్లో రూ.10 వేలు నగదు చోరీకి గురయ్యాయి. వీటితో పాటు గ్రామ శివారులో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న నీళ్ల మోటార్‌ను కూడా అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సోమవారం ఉదయం విశ్వసనీయ సమాచారం మేరకు బళ్లారి--కళ్యాణదుర్గం ప్రధాన రహదారిపై తనిఖీలు చేపట్టారు. పూలచెర్ల గ్రామ శివార్లలో అనుమానాస్పదంగా సంచులతో ఉన్న ఇద్దరు మైనర్లను గుర్తించి విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. నిందితులు పూలచెర్లలోని చోరీలతో పాటు గతంలో నల్లంపల్లి గ్రామ శివార్లలోని ఒక ఇంటి కాంపౌండ్‌లో కూడా మోటార్‌ను దొంగిలించినట్లు అంగీకరించారు. నిందితుల నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని వారిని మధ్యవర్తుల సమక్షంలో కస్టడీలోకి తీసుకుని తదుపరి చర్యలు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శంకర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

Printed, published and owned by Mahammad Munvar Basha, Printed at M/S Anju Publications, #19-2-710, Rajamma Nagar, Old Town, Ananthapuramu - 515001, Ananthapuramu Dist., Andhra Pradesh. Published at #19-2-710, Rajamma Nagar, Old Town, Ananthapuramu - 515001, Ananthapuramu Dist., Andhra Pradesh. Editor : MAHAMMAD MUNVAR BASHA. RNI No. APTEL/2020/80172 , E-mail : manassakshidaily@gmail.com